కథానిక

# ఎమిలీ

యన్. ఆర్. నంది

అర్ధరాత్రి. గాఢాంధకారం. ఆకాశం నించి పడుతున్న పాలదారి మసక కాంతిలో మంచు బిందువులు గడ్డిపోచలని ముద్దులాడుతున్నాయి. ఆ నిశ్శబ్ద మృతవాతావరణంలో మోగుతున్న చర్చిగంటలు విశాలనీలం కింద మధురంగా ప్రతిధ్వనిస్తున్నాయి.

విశాలమైన చర్చిహాలు, హాలుకి మధ్యగా పెద్ద పాలరాతి కట్టడం, అందుమీద అర్ధనిమీలిత నేత్రాలతో ఆకసంకేసి ఆలాపనగా చూస్తున్న జీసస్ ప్రతిమ, ఆ శిల కాళ్ల దగ్గర దేదీప్యమానంగా వెలుగుతున్న రెండు కేండిల్స్. వాటి వెలుగులో శిల్పసౌష్టవం వేలరెట్లు సౌందర్యవంతంగా వుంది. ఆ పాలరాతి కట్టడం మొగల్లో, మోకాళ్ళమీద మోకరిల్లి, రెండు చేతులని బిగించి, అందుమీద ముఖాన్ని వాల్చుకొని నిశ్శబ్దంగా కన్నీరు విడుస్తోందామె.

గాజుతలుపుల వెనకనించి ఫాదర్ ఆమెదగ్గరకి మెల్లగా వచ్చి తల నిమురుతూ "ఎమిలీ" అని ఆప్యాయంగా పిలచాడు.

"ఫాదర్"- ఆయన భుజాలమీద పడి భోరుమంది.

"ఏడవకమ్మా. లే ... జీసస్ నీకోసమే హెవెన్స్‌ని అలా రెప్పవేయకుండా అర్థిస్తున్నాడు. జీసస్‌ని నమ్ము. ఆయన యితరుల కష్టాలని చూస్తూ మిన్నకుండలేరు. నీకు తప్పక అభయాన్నిస్తారమ్మా."

"ఫాదర్"- ఇంకా వెక్కివెక్కి ఏడుస్తోంది. "నేను తిరిగి హిందూమతాన్ని తీసుకొంటాను."

ఫాదర్ మందహాసం చేశారు. తలమీద ముద్దుపెట్టుకొంటూ- "పిచ్చితల్లి! తిరిగి నువ్వు హిందూమతాన్ని తీసుకొంటేహిందువులు నిన్ను గుర్తిస్తారనుకొంటున్నావా? ఒకసారి నువ్వు-నువ్వుకాదు. మీ పితామహులే అనుకో- క్రిస్టియన్ మతం పుచ్చుకొన్నాక, తిరిగి ఈ మతాన్ని వొదిలి నీ హిందూమతంలోకి ప్రవేశించలేవు. మీదేశం నేను పదేళ్ళ క్రితం వచ్చాను. అప్పటి నించి నేను హిందువులని చాల సూక్ష్మంగా కనిపెడుతున్నాను. ఒకానొకప్పుడు ప్రపంచ రీతులనే దిద్దిన హిందువులిప్పుడు పూర్తిగా అజ్ఞానులై తమ గొప్పని, ఔన్నత్యాన్ని మరచి తమని తామే వంచించుకొంటున్నారు."

"ఏమయినాసరే నేను హిందువునై పోతాను ఫాదర్. ఆయన గూడ తిరిగి నన్నాదరిస్తారు. నా మూలంగానే ఆయన తల్లిని, కుటుంబాన్ని ఆ పల్లీయులు కులంనించి బహిష్కరించి, వాళ్లకి చివరికి మంచినీటిని గూడ ఆ గ్రామం నించి తెచ్చుకోనివ్వకుండా బాధపెడుతున్నారు. నామూలంగానే శ్యామ్ యిద్దరు చెల్లెళ్ళకి సంబంధాలు రావడం లేదు."

"ఇందులో నీతప్పేమీ లేదమ్మా. అది ఆ గ్రామీణుల అజ్ఞానం. పాపం, హిందువులు తరతరాలుగా ఎన్నో విదేశీయ దండయాత్రలకి చితికిపోయి, ఆ మతాల సంపర్కాలవల్ల దారీ తెన్నూ తెలీక, పిచ్చెత్తి ఆ కలవరంలో తప్పుదారులు పట్టేసమయాన ఈ బ్రిటిషువాళ్లు వచ్చారు. నేనూ ఇంగ్లీషువాడినే. ఐనా నిజం కావాలి ఎవరికైనా. ఈ మా దురహంకారం వల్లే మహామేధావులైన హిందువులు పూర్తిగా నాశనమైపోయారు. మా చేతగాని పరిపాలన వల్లే ఈ ప్రజలింత అజ్ఞానులై అంతఃకలహాల పాలయ్యారు. ముఖ్యంగా పట్టణాల సంపర్కం పూర్తిగా తెగిపోయిన పల్లెల్లో ఈ అజ్ఞానం మరీ ఎక్కువగా వుంది. అలాంటి పల్లెల నించి వచ్చినవాడే శ్యామ్ గూడ."

"శ్యామ్ పట్టణాలకి చేరుకొన్నాడు. ఈ చదువులని చదువుకొని విజ్ఞాని అయ్యాడు. తను

తన మతాన్ని తన జ్ఞానంతో విమర్శించుకొన్నాడు. మూఢనమ్మకాలని ఖండించాడు. తన మతాన్ని, తన వర్ణాన్ని చివరికి తన తల్లిని గూడ తిరస్కరించి నిన్ను వివాహం చేసుకొన్నాడు. కొంతకాలం నీతో సుఖంగా కాలం వెళ్ళబుచ్చాడు. కాని తల్లీ పిల్లల రక్తంలో ఎంత మధురాకర్షణ వుంటుందో చూడమ్మా! తల్లి అపల్లెలో తన చర్యమూలంగా బహిష్కరింపబడి అష్టకష్టాలు పడుతూ, చివరికి పల్లె నూతినీటిని గూడ తాగడానికి నోచుకోకపోతే, శ్యామ్ ఇహ భరించలేక, నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నప్పటికీ, నీమూలంగా తన జాతీయతని వొదులుకొన్నప్పటికీ, నిన్ను తిరస్కరించాడు.

"కాగా ఇప్పుడు వాళ్ళని తిరిగి ఆ పల్లెలో కలసి మెలసి వుండేలాగు నువ్వు మళ్ళా హిందూ మతాన్ని పుచ్చుకొన్నా వాళ్ళదగ్గర లాభం లేదమ్మా. నువ్వు తిరిగి హిందువైనా వాళ్ళు నిన్ను అంటరానిదానిగానే చూస్తారు. అప్పుడింకా వాళ్ళబాధ లెక్కువైపోతవి."

ఎమిలీ నోటినించి ఒక్కమాట తిరిగి రాలేదు. ఫాదర్ ముఖంలోకి జాలిగా చూసి "ఫాదర్" అని ఆయన ఛాతీమీద వాలిపోయింది.

ఫాదర్ ప్రేమగా ఎమిలీని వారించాడు. బుజ్జగించాడు. కాని ఆమె దుఃఖం మాత్రం తగ్గడం లేదు. ఫాదర్ ఓరడింపులింకా ఆమె వెక్కి వెక్కి ఏడవడానికే ఉపకరిస్తున్నాయి. ఫాదర్ ఆమెను మెల్లగా నడిపించుకొని బయటకు తీసుకవచ్చేశాడు.

"ధైర్యంగా వుండమ్మా. శ్యామ్ తప్పక తిరిగి వస్తాడు." అంటూ ఆమెను ఆమె గది దగ్గరకు తీసుకవచ్చి గది తలుపులు తోశాడు. ఎదురుగా పరుపుమీద ఎమిలీ చిన్నకూతురు, బగ్గీ, నవ్వుకొంటోంది నిద్రలో. ఆ చిన్న ముఖాన్ని చూడగానే ఎమిలీ కడుపు తరుక్కుపోయింది.

"బగ్గీ" అని పిచ్చిగా అరచుకొంటూ, ఫాదర్ని వొదిలి, చిన్నకూతురుమీద పడి, ఆ చిన్నముఖాన్ని తడుముతూ ఏడుస్తోంది.

తల్లి కేకకి బగ్గి తుళుక్కుపడి కళ్లు విప్పింది. తన్ని గాఢంగా కౌగిలించుకొని వున్న తల్లిని చూసి "అమ్మా, డేడీ వొచ్చారా?" అం మెల్లగా.

బగ్గి మాటని వినగానే ఎమిలీ దుఃఖం మరింత పొర్లిపోయింది. తను గట్టిగా ఏడిస్తే బగ్గి జడిసిపోతుందని, కంటినీటిని తుడుచుకొని, కూతురు తల నిమురుతూ "లేదు డార్లింగ్. రేపు తప్పకండా వస్తారుట" అని అబద్ధమాడింది.

"నువ్వెప్పుడూ రేపురేపనే అంటున్నావు. కాని డేడీ ఇంతవరకూ రాలేదు. నిజంగా, అసలు వస్తారా?" అని తల్లిని అమాయకంగా ప్రశ్నించింది.

"తప్పకండా వస్తారు. నువ్వు నిద్రపోమ్మా" అంటూ కౌగిలిలోని చిన్నబగ్గిని పరుపుమీద వేసింది. చిన్నఫాలంమీద అల్లిబిల్లిగా వున్న లేముంగురులని సవరించి జోకొడుతోంది.

శ్యామ్ తిరిగి ఎప్పుడొస్తాడో ఎమిలీకి తెలీదు. ఆవాళ సాయంకాలం ఇంకా ఎమిలీకి జ్ఞాపకముంది. మేడమీద చివరి అంతస్థులో శ్యామ్ కూచొని పిచ్చిగా ఆకాశంకేసి చూస్తూ నిట్టూర్పులు విడుస్తున్నాడు! కిందన వున్న ఎమిలీకి శ్యామ్ ఎక్కడున్నాడో తెలుసు. కాని అతన్ని చేరడానికి ఆమెకి ధైర్యం చాలటం లేదు.

ఎనిమిదేళ్ళ క్రితం, కాలేజీలో చదువుకొంటున్నప్పుడు ఇద్దరు పరస్పరం ప్రేమించుకొని పెళ్ళిచేసుకొన్నారు. సంఘం, సనాతనులు, కొంతమంది స్నేహితులు గూడ శ్యామ్ని ఆ వివాహం గురించి వారించారు. శ్యామ్ వాటిని లెఖ్ఖచెయ్యలేదు. తల్లికి ఉత్తరం రాశాడు. తల్లి నిరాకరించింది. తను స్వయంగా బయలుదేరి వెళ్ళి, తల్లిని బతిమాలుకొన్నాడు. అలిగాడు. ఏడ్చాడు. చివరికి తిరస్కరించాడు. ఈ మతాంతర వివాహం సంగతి గ్రామీణులకి తెలిసింది. వెంటనే పర్యవసానాలు అమాయకులైన అబలలు మీద ప్రసరించారు.

ఎమిలీతో మొదటి మూడేళ్లు చాలసుఖంగా గడిపాడు శ్యామ్. ప్రపంచంలో తనంత సుఖిస్తున్న వ్యక్తి లేడేమో అనుకొన్నాడు. కొంతమంది స్నేహితులు తన్ని వొదిలినా శ్యామ్ ఒక్క ఎమిలీ సమక్షంలోనే లక్షమంది ప్రాణ

స్నేహితులని, ఆప్తులని అనుభవించాడు. అప్పుడో వేదాంతం గూడ చెప్పేవాడు: "ఆదిలో అందరు మానవులు ఒక్కటైనప్పుడు, నా మతాంతర వివాహంలో తప్పేముంది? మతం, వర్ణం, జాతి, కులం అంటే ఏమిటి? కృత్రిమం. అంతా మనం సృష్టించుకొన్న భేదాలు. ఈ కృత్రిమానికి బానిసలమై, మాయ జీవితాన్ని గడుపుతున్నాం. ఈ ప్రేమ, మోహం, స్త్రీ పురుషుల సంబంధం మతాలకి, జాతులకి, వర్తించవు-కారణం ఇవి మనం కల్పించుకొన్న కందకాలు కాబట్టి. అలాంటప్పుడు నా వివాహంలో తప్పేముంది" అని.

కాని రానురాను ఎమిలీ సమక్షంలో ఇంతక ముందంత స్వర్గాన్ననుభవించే వాడు కాడు. ఇద్దరిలో అభిప్రాయ భేదాలు వచ్చాయి బగ్గీ భవిష్యత్తుమీద. కాలేజీనించి యింటికి తిరిగొస్తూ ఇంతకు ముందులా ముందుగా ఎమిలీని పిలిచి ముద్దుపెట్టుకోవడం మానేశాడు. రోజూ ఆమె కోసం ఏదో ఒకటి తెచ్చేవాడు కాని ఇప్పుడది పూర్తిగా మానేశాడు. ముక్తసరిగా మూడు మాటలతో మేడమీదకి వెళ్ళిపోయి, ఏమిటో దీర్ఘాలోచనలో వుండిపోయేవాడు. ఎమిలీ అతన్ని చేరటానికే భయపడేది. ట్రేలో తేనీరు చల్లగా అయిపోయినా, 'వెడతా వెడతా' అనుకొంటూ అలానే కుర్చీలో కూలబడిపోయేది.

ఆవాళ సాయంకాలమూ అలానే శ్యామ్ కాలేజీనించి తిరిగివచ్చి మేడమీదికి వెళ్ళిపోయాడు. ఎమిలి ట్రేతో టీ పట్టుకొని పైకి వెళ్ళింది. శ్యామ్ వెనక్కి తిరిగి చూడలేదు. అరగంట, గంటకూడ అయిపోయింది. శ్యామ్ తల తిప్పడు, ఎమిలీ మాటాడలేదు. చివరికి తెగించి ధైర్యంగా దగ్గరికి వెళ్ళింది.

"టీ తీసుకోరూ"

"ఊఁ. అక్కడవుంచి వెళ్ళు"

అంతే! ఎమిలీ మరోమాట ఆడలేకపోయింది. ఒక నిట్టూర్పువిడచి వెనక్కి తిరిగింది.

తెల్లవారింది. ప్రపంచమంతా ఒక్కసారిగా పేలిపోయినంత భయంకర వార్త వినిపించింది. ఎమిలీ కంగారుగా లేచింది. శ్యాం లేడు. తన బల్లమీద ఒక వుత్తరాని పెట్టి వెళ్ళిపోయాడు. అది చూసుకొని ఎమిలీ విరుచుక పడిపోయింది. ఇక తనకేముంది? అంతా శూన్యం, అంధకారం, గాఢాంధకారం. శ్యామ్ లేనిది తనెందుకు బతికి? ఆత్మహత్య చేసేసుకోవాలనుకొంది. వెంటనే చిన్నబగ్గీ జ్ఞాపకానికి వచ్చింది. తను తొందరగా అవివేకంగా అంతపని చేస్తే తన చిట్టిబగ్గీగతి? ఎమిలీకి ఏమీ తోచలేదు. ఎంతసేపో ఏడ్చింది. ఎంతో కన్నీటిని కార్చింది. కాని రోజులు, నెలలు తిరిగిపోయాయి శ్యామ్ తిరిగి రాకండానే. అప్పటినించి ఆమెకి ఫాదర్ రక్షణ నిచ్చాడు.

ఫాదర్ రెండుసార్లు శ్యామ్‌కి ఉత్తరాలు రాశాడు. కాని శ్యామ్ దగ్గరనించి: "క్షమించండి ఫాదర్. నన్నిక మీరు బలవంత పెట్టకండి. విడాకులకి నేను విముఖుడను. అందువల్ల నేను నెలనెలా సగం నా జీతాన్ని పంపిస్తుంటాను" అనే సమాధానం రాగానే ఫాదర్ కంటినించి నీళ్లు జల్లున రాలాయి. ఎమిలీకి కావలసింది శ్యామ్ నెలనెలా పంపించే నాలుగు వందల రూకలా? ఎమిలీకి ఈ సంగతి తెలిస్తే? ఫాదర్ ఆ వుత్తరాన్ని ఎమిలీకి చూపించలేదు.

శ్యామ్ ఎమిలీని హృదయపూర్వకంగా ప్రేమించినా, ఒకరోజు ఎవరోవచ్చి ఆగ్రామంలో తన తల్లి, చెల్లెల్లు పడుతున్న బాధలని చెప్పగానే శ్యామ్ నిలువునా నీరయిపోయాడు. అతనిలో కలవరం రేగింది. ఒకపక్క అమాయక ఎమిలీ, తన ప్రాణం. రెండోపక్క తన్ని నవమాసాలు మోసి కని పెంచిన తల్లి. ఆమె ప్రాణంనించి, రక్త భాగాలనించి, శరీరంనించి తను పుట్టాడు. తను ఆ రహస్యానే మరచి ఆమెను, ఎమిలీగురించి తిరస్కరించాడు. ఎమిలీ మూలంగానే తన తల్లి అన్ని కష్టాలకీ, బాధలకీ గురయింది. ఇది ఎమిలీమతంవల్లో, గ్రామీణుల అజ్ఞానంవల్లో, శ్యామ్ ఆ వుద్వేగంలో విడదీసి సూక్ష్మంగా పరీక్షించ లేకపోయాడు. అందులో అప్పుడప్పుడే రేగుతున్న అభిప్రాయ భేదాలు. శ్యామ్ ఇక తర్కించుకో లేకపోయాడు-తల్లి పాదాలమీద వాలిపోయాడు. ఆమె క్షమించాననేవరకూ తలని నేలమీద బాదుకొన్నాడు. ఆమెకోడును లేవనెత్తి ఆప్యా

యంగా తల నిమిరింది. శ్యామ్ తృప్తి చెందాడు.

కాని ఎదురుగా ఇరవైరెండేళ్ళ చెల్లెలిని చూడగానే శ్యామ్ గుండె ఒక్కసారిగా తల్లడిల్లిపోయింది. ఆమెకితోడు పంధొమ్మిదేళ్ళ మరో చెల్లెలు. ఊరి చివర పూరిగుడిసె నివాసమయింది. "నీ కొడుకు కిరస్తానీవాడయితే, నువ్వెందుకు మా మధ్య" అని ఆమెని గ్రామం నించి తగిలేశారు పల్లీయులు.

శ్యామ్ విద్యావంతుడే, మహామేధావే. కాని అతని చుట్టూవున్న వాళ్లు లక్షలకొద్దీ అజ్ఞానులు, మొండిపట్టు కసాయివాళ్లు. "బాబూ ఇది కాదు దారి" అని వాళ్ళని మెల్లగా బుజ్జగించినా, వాళ్లు బూతులతో సమాధానాన్నిచ్చేవారు. అన్నివేల పూరిగుడిసెల మధ్య ఒక మహా మాణిక్యమున్నా దాని తేజస్సుని ఆ మట్టి గోడలు పైకి రానిస్తే కదూ?

ఈ అజ్ఞానుల కర్కశత్వంలో నలిగి కిరకిర్లాడుతున్న తనతల్లి చెల్లెళ్లకోసం, ఈ కుళ్లు మనుషుల చొంగమాటలకి నలిగిపోతున్న కన్నకడుపుని రక్షించడంకోసం, తన రక్తభాగమైన చిట్టిబగ్గిని, అమాయక ఎమిలీని శాశ్వతంగా విడచిపెట్టి, ఆ అజ్ఞానుల కాళ్లు పట్టుకొన్నాడు. తన తల్లిని రక్షించమన్నాడు. తన చెల్లెళ్ల ముఖాలైనా చూడమన్నాడు. వాళ్లు విదలించుకొన్నారు.

పట్నంలోకి పోయి చెల్లెళ్లకి పెళ్లిళ్లు చేయాలనుకొన్నాడు. కాని తల్లి ఒప్పుకోలేదు.

"మనం యిక్కడ పుట్టాం, యిక్కడ పెరిగాం. మనమేకాకుండా మన తండ్రులు తాతలు అందరూ యిక్కడే పుట్టారు. మనం ఈ గ్రామీణులకి దగ్గరివాళ్ళం-వాళ్లు మన్నెంతగా హింసిస్తున్నా మన్ని వాళ్లు గ్రామంనించి తరిమేసినా ఈ గ్రామం మనదే బాబూ. ఆ పట్టణాల్లో మనం ఒక్క నిముషంగూడ బతకలేం" అంది. ఆమెగూడ ఆ మూఢగడ్డ మీదే పెరిగింది. ఆ అజ్ఞానుల ప్రథమాక్షరాల్లోనే మాటలు ఏర్చి కూర్చుకొంది. ఆమెగూడ మూఢనమ్మకాలనే జీర్ణించుకొంది.

శ్యామ్ తల్లి అలా నిరాకరించగానే, శిలైపోయాడు. ఐతే ఇక భవిష్యత్తంతా శూన్యమే? ఆ తల్లిగురించే కదూ ఎమిలీని విడచిపెట్టడం? ఆ చెల్లెళ్ల భవిష్యత్తుగురించే కదూ తన చిన్నబగ్గిని నిరాకరించింది? ఆ అజ్ఞానులనించి దూరంగా పోవాలన్నా తల్లి నిరాకరిస్తోంది. ఏమిటి గత్యంతరం?

శ్యామ్ రోజూ యిదే ఆలోచించుకొంటూ వెర్రిగా కూచున్న చోటునించి కదిలేవాడు కాదు. తల తిరిగిపోతోంది. ఎమిలీ-తల్లి, చిన్న చెల్లెళ్లు-చిట్టిబగ్గి, తల్లి మూఢనమ్మకాలు, అజ్ఞానుల నిలువుకోత-తల్లి నెలాగయినా ఒప్పించాలని ఎన్నోసార్లు ప్రయత్నించి చూశాడు. ఆమె చివరికి ఏడుస్తూ "నన్ను చంపి నీ యిద్దరి చెల్లెళ్ళని తీసుకపో" అనగానే శ్యామ్ ఇక మాటాడలేకపోయాడు.

కొడుకు రోజురోజుకీ చిక్కిపోతున్నాడు. అన్నం సరిగా తినడు. చివరికి నీరయినా ముట్టడంలేదు. ఏవో దీర్ఘాలోచనలతో ప్రతిఫలం లేని నిట్టూర్పులతో కాలాన్ని సోమరిగా హరించేస్తున్నాడు. తల్లి శ్యామ్‌ని బతిమాలుతుంది. శ్యామ్ జాలిగా తల్లికేసి చూస్తాడు. ఆ చూపులని చూస్తుంటే ఆమె కడుపు తరుక్కుపోయేది.

ఇలావుండగా ఒకరోజున శ్యామ్‌పేరన ఒక వుత్తరం వచ్చింది. శ్యామ్ కంగారుగా ఉత్తరాన్ని విప్పిచూశాడు. ఫాదర్ రాసింది. పైకి చదువుతున్నాడు. తల్లి పక్కనేవుంది.

"డియర్ శ్యామ్, ఇందులో ఎవరిని తప్పుపట్టాలోగూడ అర్థంగావటంలేదు. నేను మీ హిందువుణ్ణికాను. హిందూమతంనించి మతం మార్చుకొన్న హిందూ క్రిష్టియన్నీ కాను. మీకు ఎన్నోమైళ్ళదూరంనించి వచ్చిన ఆంగ్లేయుణ్ణి. "మాదేశం మీదేశంకంటె గొప్పది, మావాళ్లు మీకంటె మేధావులు" అని నేననను. పైగా మావాళ్ళ అసూయాధికారాల వల్లే మీరు, మీపట్టణాలు, మీదేశంలోని ప్రతీ అణువు పూర్తిగా గుర్తుపట్టడానికే వీలులేకండా మారిపోయినై. మామతం గొప్పదనే గర్వంతో మీ హిందువుల వ్యక్తిత్వాన్ని పూర్తిగా అణచేశాం. మిమ్మల్ని పూర్తిగా నాశనం చేసేశాం.

"ఎమిలీ క్రిష్టియన్ మతస్థురాలని, ఆమెను నువ్వు వివాహమాడిన పర్యవసానంగా మీ కుటుంబాన్ని మీవాళ్లే వెలివేశారు. నువ్వు

మీతల్లి కష్టాలని విని, సహించలేక ఎమిలీ మూలంగానే నీతల్లి అన్ని కష్టాలకి గురయిందని ఎమిలీని, మీ యిద్దరి కలయిక సాక్షిగా పుట్టిన చిట్టిబగ్గిని విడచిపెట్టేశావు. కాని ఎమిలీ ఎవరో నీకు జ్ఞాపకముందా? అసలు ఎమిలీ ఎక్కడ పుట్టిందో నీకు తెలుసా? ఆమె సముద్రాలు, ఖండాలు, దేశాలు, పట్టణాలు దాటుకొంటూ వచ్చిన మ్లేచ్ఛమగువా కాదు, ఆంగ్ల స్త్రీ కాదు. మీ గడ్డనించే, మీ మతంనించే, మీ జాతినించే పుట్టిన హిందూస్త్రీ. ఆమె నరనరాల్లోనూ హిందూ రక్తముంది. ఆమెగూడ నిన్ను హిందూ స్త్రీలాగే పాదపూజ చేసింది. కాని నువ్వు ఆమెను ఆ ఉద్వేగంలో గుర్తించలేక పోయావు.

"ఎమిలీ పితామహులు పవిత్ర హిందువులు. నీకు ఎమిలీ ఈ విషయాన్ని చెప్పేవుంటుంది. అప్పటి మా చేతగాని పరిపాలనవల్ల దేశంలో కరువు పుట్టింది. తినడానికి తిండిలేక వేలకొద్దీ ప్రజలు అల్లల్లాడి పోయారు. ఎమిలీ పితామహులుగూడ తిండిలేక మలమల మాడుతూ, గంపెడు పిల్లలని ఎలా పోషించడం అని కృంగిపోతున్న సమయాన, ఈ దేశంలో అప్పుడప్పుడే వ్యాపిస్తున్న క్రిష్టియన్ మతం ఆయనకి ఒక కొత్తవెలుగుని చూపించింది. మొట్టమొదట్లో ఆయన నిరాకరించి, చివరికి గతిలేక ఈ మతాన్ని తీసుకొన్నాడు. అంతే! ఎమిలీ కూడ ఆ తోవనే నడచింది.

"అయినా మతాలు మారడంవల్ల మనుషులే మారిపోతారా? భూతాలయిపోతారా? ఈ బుద్ధి నీమనసుకి తట్టిన బుద్ధికాదు. ఇక ఆ సంగతి విడిచిపెట్టు.

"ముఖ్యంగా చెప్పవలసింది నీ చిన్న బగ్గి గురించి. ఆమె నీ కూతురు కాదంటావా. నిన్ను కోర్టుకి ఈడ్పించేంత నీచురాలు కాదు ఎమిలీ- కారణం ఆమెలో గూడ నీలాంటి హిందూరక్తమే వుంది గాబట్టి. బగ్గి నీ గురించి ఏడ్చేడ్చి చివరికి చిక్కి శల్యమయి పోయింది. ఆశగా ఎమిలీని 'అమ్మా! నాన్నగారింకా రావడానికి ఎన్ని రేపులు గడవాలే?' అంటుంది- ఈ 'రేపుల' గొలుసులు బలమైన లంకెలని ఆ చిన్ని మనసుకి తెలీదు. ఎమిలీ ఏమని సమాధానం చెబుతుంది? నువ్వు వెళ్ళిపోయేప్పుడు నీ పోకనిగాని, నీ చివరి మాటనయినా ఆమెకి తెలపకండా, ఒక్క చిన్న కాయితం ముక్కతో ఆమె ప్రేమని తిరస్కరించి వెళ్ళి పోయావు! అలాంటప్పుడు ఆ అమాయక ఎమిలీ గూడ నీరాక రేపనే పిచ్చిభ్రమలో తృప్తిపడు తుండడంలో ఆశ్చర్యం లేదు.

"నువ్వు నీతల్లి గర్భాన పెరిగినట్టే నీ చిన్ని బగ్గి గూడ, నీవల్ల ఎమిలీ గర్భంలో పెరిగింది. ప్రపంచంలో అందరి తల్లుల మమతా ఒకటే కదూ? అందుకే ఎమిలీ నిన్ను దైవ సమానంగా చూసుకొంది. నిన్ను నమ్మింది. నీ తిరస్కృతితో పిచ్చిదై యిరవైనాలుగు గంటలూ ఆ జీసస్ ప్రతిమముందు కూచొని నిశ్శబ్దంగా కన్నీరు విడుస్తుంది. ఆయన కాళ్ళదగ్గర రెండు కేండిల్స్ నువ్వెప్పుడు తిరిగొచ్చినా సమాధానాన్ని స్తాయి. ఆ కొవ్వు కరిగి, ఒత్తికాలి నుసి అయి పోయినా, అవి ఈ వాతావరణంలోనే దాగి వుంటవి.

"ఎమిలీ నాతో ఎన్నోసార్లు చెప్పింది: 'ఆయనకి ఒక వుత్తరం రాయండి ఫాదర్. చచ్చిపోయే ముందొకసారి చిన్ని బగ్గీని, నన్ను చూసి వెళ్ళిపోమని' అని. ఈ మాటలని ఆమె హృదయపూర్వకంగానే అందని నాకు నమ్మకం వుంది... నేను నీకు రాస్తాను. కాని ఏం లాభం? నువ్వు మీ సంఘానికే జడిశావు. నీ ప్రజలకే వెరచావు. కాదు, వాళ్ళ కృత్యాలకి ఆహుతయ్యే నీ తల్లి కష్టాలని చూస్తూ మిన్నకుండ లేకపోయావు.

"నేను నిన్ను బలవంతం చేయను. కాని ఒక్కటిమాత్రం జ్ఞాపకముంచుకో. నీ తల్లినించి నువ్వు పుట్టినట్టే, బగ్గీ కూడ 'నీ ఎమిలీ నించి' పుట్టినట్టు మరచిపోవద్దు. నీకు మూడొంతులు రేపే మరో 'నల్లంచుల ఉత్తరాన్ని' రాస్తాను. టెలిగ్రాం ఎందుకు?-ఫాదర్."

తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు ఆ వుత్తరాన్ని విన్నారు. శ్యామ్ కళ్ళల్లో సముద్రాలు చెలరేగాయి. ముదిరాలు ముక్కలై ముసురు పట్టినట్టు, వెల్లువలయ్యాయి. కాళ్ళు వొణికిపోయాయి. కళ్ళముందు కళ్ళుమూసిన ఎమిలీ, ఆమెపక్కనే కొయ్యబారిన బగ్గీ.

"బగ్గీ" పిచ్చిగా అరచి వూగిపోయాడు శ్యామ్.

"అన్నాయ్" అంటూ ఇద్దరు చెల్లెళ్లూ శ్యామ్‌ని పట్టుకొన్నారు.

తల్లి మెల్లగా శ్యామ్ దగ్గరకి వచ్చి ప్రేమగా తల నిమిరింది. ఆమె కళ్ళల్లో గూడ కన్నీరు నిలచింది.

"నువ్వు వెళ్ళి ఎమిలీని తీసుకరా నాన్నా" అంది కంపిస్తున్న కంఠంతో. "ఇంతక ముందంతా మన్ని ఎవరు హింసించారో, వాళ్ళే మన్నింకా హింసిస్తున్నారు. ఎలాను మనం వాళ్ళనించి విడిపోదాం. మీతో కలుస్తాం బాబూ అని కాళ్ళూ వేళ్ళూ పట్టుక ప్రాధేయపడ్డా విదిలించుక పోతున్నారు. అలాంటప్పుడిక ఆమెను మనం యిక్కడికి తీసికొస్తే తప్పేముంది? నువ్వు యిప్పుడే వెళ్ళి కోడలిని తీసుకరా బాబూ" అంది. ఆమె గొంతుకలో స్థయిర్యం వుంది. ధైర్యంగా ఆ మాటలనంది.

తల్లి ఆ మాటలననగానే శ్యామ్ కళ్ళల్లో ఆనందాశ్రువులు తిరిగాయి. ఆ పరవశత్వంలో అవి ఛాతీమీద గూడ రాలాయి. "అమ్మా" అన్నాడు ఆనందంతో.

"త్వరగా వెళ్ళి కోడలిని తీసుకవచ్చేయ్ బాబూ. అందరంకలసి ఊరి చివర పాడు నూతి నీళ్ళనే తాగుదాం" అని కొడుకుని పంపించింది.

శ్యామ్ ఒక్క దూకులో కట్టుబట్టలతో స్టేషన్ చేరుకొన్నాడు. అమ్మకి గూడ గ్రామీణులమీద విరక్తి పుట్టింది. వాళ్ళనిక లెక్ఖ చేయకండా 'నా కోడలు' అని ఎంత ఆనందంగా, ధైర్యంగా అంది! ఆ మూర్ఖుల మొండి మూఢ నమ్మకాలని అనుభవించే ప్రతి వ్యక్తి చివరికి అలానే మారిపోతాడేమో?

నగరాన్ని చేరుకొనేసరికి బాగా చీకటి పడిపోయింది. చర్చి గంటలు దూరానికి వినిపిస్తున్నాయి. శ్యామ్ చర్చి హాలులోకి ప్రవేశించాడు. జీసస్, ఆ రెండు దీపికల వెలుగులో, యిప్పుడు తన్ని ప్రశ్నించబోరేమో వారికి సమాధానం చెప్పడానికి కిందికి తల వొంచుకొని వున్నాడు.

శ్యామ్ జీసస్‌ని ప్రశ్నించలేదు. ఫాదర్ గది దగ్గరకు వెళ్ళాడు. ఫాదర్ లేడు. వెనక్కి తిరిగాడు. ఆ చిట్ట చీకటిలో దూరాన అగుపిస్తున్న బరియల్ గ్రౌండ్‌లో (శ్మశాన వాటిక) అసంఖ్యాకమైన శిలువలు నిశ్శబ్దంగా నిద్రపోతున్నాయి. ఒక క్రాస్ ముందు ఫాదర్ తలొంచుకొని బైబిల్‌లోని అక్షరాలని విడిచే శ్వాసతో ఉచ్ఛరిస్తున్నాడు. శ్యామ్ ఒక్క గంతులో ఫాదర్‌ని చేరుకొన్నాడు.

"ఫాదర్"

ఫాదర్ స్వేచ్ఛా నిద్రలో కళ్లు మూసిన జీవులని జోకొడుతున్నాడు.

పక్కనే వున్న చిన్న బగ్గీ రెండు నిముషాల వరకూ శ్యామ్‌ని గుర్తించలేదు. ఆ పర్వాన్ని విని తల పైకెత్తి "డేడీ డేడీ" అని శ్యామ్‌ని గట్టిగా కౌగలించుకొంది "డేడీ... అమ్మ" ఏడుస్తూ తండ్రినింకా గట్టిగా పట్టుకొంది.

ఎదురుగా వున్న కాఫిన్ (శవ పేటిక)ని చూశాడు. అంతా అర్థమయింది. శ్మశానం అదిరిపోయేట్టు పిచ్చిగా అరచి చిన్న బగ్గీని గట్టిగా హృదయానికి హత్తుకొన్నాడు. తండ్రి అలా అరవగానే బగ్గీ జడిసిపోయింది.

ఫాదర్ తలతిప్పాడు.

"శ్యామ్, వొచ్చావు... కాని అల్లరి చేయకు. నిద్రపోతున్న ఆత్మని బలవంతాన లేపలేవు. హిందూమతం కాదు బాబు. ఏడ్పులతో కన్నీటితో మీ ప్రేమలని, ఆశలని, దుఃఖాలని, దయలని వ్యక్తం చేయడానికి" అన్నాడు మెల్లగా.

శ్యామ్‌కా మాటలు చెవిలో దూరలేదు. మూగగా చివరిసారి "ఎమిలీ" అని ఉచ్ఛరించాడు. ఎప్పుడో, ఎంతకాలం క్రితమో ఎలాగు ఆమెను ప్రేమగా పిలచేవాడో ఆ పేరే 'ఎ-మి-లి'. కాని 'శ్యామ్' అనే సమాధానమే కరువైంది. వికటంగా మృతజీవులు నవ్వాయి. శ్యామ్‌కి వెనకటి జీవితం తలపుకొచ్చి గట్టిగా అరచాడు—"ఎమిలీ!"

"ఎమిలీ... ఎమిలీ... మిలీ... మి లి లి లీ" మిగతా శిలువ లాకేకని రెట్టించాయి, పాపం, శ్యామ్ ఒక్క గొంతుకా అనంతదూరాన వున్న ఎమిలీకి వినిపిస్తుందో వినిపించదో అని!